జిల్లావ్యాప్తంగా ఘనంగా ఏకలవ్యుని జయంతి -8లో


# తొలి ఏకాదశి వేళ...



అయినవిల్లిలో విఘ్నేశ్వర స్వామి,
ఆత్రేయపురం మండలం వాడపల్లిలో వేంకటేశ్వర స్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులు



తొలి ఏకాదశిని బుధవారం జిల్లా అంతటా ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. విష్ణాలయాలతో పాటు పలు ఆలయాలను సర్వాంగసుందరంగా అలంకరించారు. అర్చకులు అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులు బారులు తీరి స్వామివార్లను దర్శించుకున్నారు. ముమ్మిడివరంలో ప్రత్యేక అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత కేశవస్వామిని పక్క చిత్రంలో చూడొచ్చు... 8లో





గంటిపెదపూడిలో వంతెన పనుల్లో భాగంగా కొలతలను పరిశీలిస్తున్న పంచాయతీరాజ్ ఎస్ఈ రవీంద్ర

## వరదలు వచ్చేలోపు బాటమ్ ప్లగ్గింగ్ పనులు పూర్తి చెయ్యాలి

### పంచాయతీరాజ్ ఎస్ఈ రవీంద్ర

పి.గన్నవరం, జూలై 17: మండలంలోని గంటి పెదపూడి, ఉడిమూడి లంక గ్రామాల ప్రజల కోసం నిర్మితమవుతున్న హైలెవెల్ బ్రిడ్జి పనుల్లో భాగంగా పి-3, పి-4లకు బాటమ్ ప్లగ్గింగ్ పనులను వరదలు వచ్చేలోపు పూర్తి చేయాలని పంచాయతీరాజ్ ఎస్ఈ రవీంద్ర అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన వంతెన పనులను పరిశీలించారు. అనంతరం రవీంద్ర మాట్లాడుతూ ఇప్పటివరకు ఏటిగట్టు దిగువున వంతెన ప్రారంభంలో ఎబాట్ మీట్‌తో పాటు బెడ్ బ్లాక్ వరకు రెండు పిల్లర్లు పూర్తయ్యాయని తెలిపారు. వంతెన 3, 4 పిల్లర్లకు సంబంధించి వెల్ ఫౌండేషన్ ఎంత లోతు వరకు వెళ్లిందో పరిశీలించా నన్నారు. నిబంధనలు అనుసరించి కొలతలు ఉండడంతో బాటమ్ ప్లగ్గింగ్ పనులు పూర్తి చెయ్యాలని సూచించారు. వంతెన పనులు చురుగ్గా సాగుతున్నాయని, గడువు లోపే వంతెన నిర్మాణం పూర్తయ్యే అవకాశం ఉందని సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పంచాయతీరాజ్ ఈఈ చంటిబాబుతో పాటు స్థానిక ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టరుకు పలు అంశాలపై సూచనలు చేశారు. పరిశీలనలో ప్రాజెక్టు డీఈఈ అన్నం రాంబాబు, ఏఈఈ కొండలరావు, సత్యనారాయణ, కాంట్రాక్టర్ పీపీ రాజు, డిజైనర్ కుమార్ ఉన్నారు.



మాజీ ఎమ్మెల్యే బీవీ రమణయ్య జయంతి... 8లో




పంట పొలాల్లో నిలిచిన నీరు



రైతుల పాలిట శాపంగా శంకరగుప్తం డ్రెయిన్



ఆక్రమిత గోగన్నమఠం డ్రెయిన్‌లో చెరువులు

# నిలువునా ముంచుతోంది

మలికిపురం, జూలై 17: శంకరగుప్తం డ్రెయిన్ రైతుల పాలిట శాపంగా మారింది. 22 కిలోమీటర్ల పరిధిలో ఉన్న ఈ డ్రెయిన్‌లోకి 11 డ్రెయిన్లు వచ్చి కలవడంతో ముంపు నీటితో అటూ ఇటూ కదలక రైతన్నను నిలువునా ముంచుతోంది. 30వేల ఎకరాల ఆయకట్టున్న ఈ ప్రాంతంలో శంకరగుప్తం డ్రెయిన్ నిర్వాకంతో సార్వాకు 5వేల ఎకరాలు, దాళ్వాకు 12వేల ఎకరాలు మాత్రమే సాగు జరుగుతోంది. దీంతో రైతులు దాదాపుగా సార్వా పంటను వదులుకుంటున్నారు. దాళ్వాను వీలును బట్టి సాగు చేస్తున్నారు. ప్రధానంగా గోగన్నమఠం డ్రెయిన్ ఆక్రమణకు గురవ్వడంతో ఆ భారమంతా శంకరగుప్తం డ్రెయిన్‌పై పడింది. దీంతో ఈ డ్రెయిన్ ఆటుపోట్లు సరిగా లేక రైతులకు తీరని నష్టం జరుగుతోంది. గోగన్నమఠం డ్రెయిన్‌లోకి సముద్రపు ఆటుపోట్లు వచ్చేవి. ఆ డ్రెయిన్ 8 కిలోమీటర్ల పరిధిలో 110 అడుగుల వెడల్పున ఉండేది. ప్రస్తుతం 10 అడుగులు మాత్రమే ఉంది. 8 కిలోమీటర్ల మేర వంద అడుగుల మేరకు ఆక్రమణలకు గురయ్యాయి. రొయ్యలు చెరువులుగా రూపాంతరం చెందాయి. ప్రస్తుతం డ్రెయిన్ పది అడుగులువెడల్పుమాత్రమే ఉంది. ఈ డ్రెయిన్ సముద్రం వైపు సొసైటీ భూములు ఉన్నాయి. ఆక్రమణ ప్రాంతంలో రొయ్యల చెరువులతో ఈ డ్రెయిన్ విరాజిల్లుతోంది. శంకరగుప్తం డ్రెయిన్ మెండుపాలెం సున్నా కిలోమీటరు నుంచి కరవాక వరకు 22 కిలోమీటర్లు విస్తరించి ఉంది. సున్నా కిలోమీటరు నుంచి 8.5 కిలోమీటర్ల కేశనపల్లి వరకు డ్రెడ్జింగ్ అయింది. కాంగ్రెస్ హయాంలో 16.4 కిలోమీటరు నుంచి 22 కిలోమీటర్ల వరకు డ్రెయిన్ తవ్వకం జరిగింది. మిగిలిన 8.5 కిలోమీటర్ల నుంచి 16.4 కిలోమీటర్ల వరకు డ్రెడ్జింగ్ జరగకపోవడంతో డ్రెయిన్ మధ్యన మెరక ఉండడంతో సముద్రపు ఆటుపోట్లు సరిగా జరగట్లేదు. ముఖ్యంగా 8.5 నుంచి 16.4 వరకు డ్రెడ్జింగ్ చేస్తే కొంతవరకు శంకరగుప్తం డ్రెయిన్ పనిచేసి రైతులకు ముంపు భారం తగ్గుతుంది. సున్నా కిలోమీటరు దగ్గర డ్రెయిన్ 90 మీటర్ల వెడల్పు ఉండగా కేశనపల్లి వచ్చేసరికి 50 మీటర్లకు మరికొన్ని చోట్ల మరింత ఆక్రమణలకు గురైంది. శంకరగుప్తం డ్రెయిన్‌లో పొన్నమండ 1, 2, 3 డ్రెయిన్లు, కాట్రేనిపాడు, కూనవరం, నామనపాలెం, చింతలపల్లి, బి.సావరం, గూడపల్లి మైనర్ డ్రెయిన్, కత్తిమండ, అంతర్వేది-1 డ్రెయిన్లు కలుస్తున్నాయి. 2017 డిసెంబరులో డ్రెడ్జింగ్ చేసిన తర్వాత 2019 నుంచి ప్రాంతంలో ఉప్పునీటికి కొబ్బరి చెట్లు చనిపోవడం మొదలైంది. గోగన్నమఠం డ్రెయిన్ 2018-19 సమయంలో ఆక్రమణలకు గురైనట్టు స్థానికులు చెప్తున్నారు. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారినా గత పాలకులు నిర్లక్ష్యం చేయడంతో ఈ పరిస్థితి దాపురించింది. డ్రెయిన్ల దుస్థితిని పరిశీలించిన గత కలెక్టర్ గట్లు ఎత్తు చేయడానికి రూ.2.10 కోట్లు మంజూరు చేసినా కార్యరూపం దాల్చలేదు.

**డ్రెయిన్లు మెరుగుపరచాలి: కడలి సత్తిబాబు, రైతు, మలికిపురం**

శంకరగుప్తం డ్రెయిన్‌తో పాటు చిన్న డ్రెయిన్లను కూడా మెరుగుపరిస్తేనే రైతులకు మేలు జరుగుతుంది. ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలి.

**డ్రెయిన్లను ఆధునికీకరించాలి: ముప్పర్తి సుబ్బారావు, రైతు, మోరిపోడు**

శంకరగుప్తంలోకి కలిసే చిన్న డ్రెయిన్లను కూడా మెరుగుపరచాలి. ముంపునీరు దిగక పంటలను వదులుకోవాల్సి వస్తుంది. మరోపక్క కొబ్బరి చెట్లు కూడా చనిపోవడంతో దిక్కుతోచడం లేదు.

**ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం: ఆర్.నాగార్జున, డ్రైనేజీ డీఈ**

డ్రెయిన్ల సమస్యను రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ దృష్టికి తీసుకెళ్లాం. శంకరగుప్తం డ్రెయిన్‌ను మధ్యలో డ్రెడ్జింగ్ చేస్తే సమస్య కొంత వరకు పరిష్కారమవుతుంది. గోగన్నమఠం డ్రెయిన్ ఆక్రమణే ఈ సమస్యకు కారణం. ప్రభుత్వ సహకారంతో త్వరలో సర్వే చేస్తాం.

# నేరాల అదుపునకు అధిక ప్రాధాన్యం



కోనసీమ జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన బొడ్డేపల్లి కృష్ణారావు

అమలాపురం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నేరాలను అరికట్టేందుకు కృషి చేస్తానని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన బొడ్డేపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. బుధవారం ఉదయం అయినవిల్లి సిద్ధివినాయక ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం అమలాపురంలోని ఎస్పీ కార్యాలయానికి చేరుకున్న ఆయనకు పోలీసు అధికారులు స్వాగతం పలికారు. అనంతరం తన చాంబర్‌లో ఎస్పీగా కృష్ణారావు ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కోనసీమలో శాంతి భద్రతలను పూర్తిగా అదుపులో ఉంచడంతో పాటు నేరాల సంఖ్యను తగ్గించడానికి మొదటి ప్రాధాన్యత ఇస్తానని పేర్కొన్నారు. ఏలూరు రేంజ్ పరిధిలో ఎస్పీగా బాధ్యతలు చేపట్టడం ఇదే ప్రథమమన్నారు. జిల్లాలో సుమారు 200కు పైగా సిబ్బంది కొరత ఉందని, వీటిని భర్తీ చేయడానికి చర్యలు తీసుకుంటానని చెప్పారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న సమస్యలను పోలీసు అధికారుల నుంచి తెలుసుకుంటానని కృష్ణారావు చెప్పారు. గత ఎస్పీలకు అందించిన మాదిరిగానే పోలీసులు, ప్రజలు, రాజకీయ పార్టీల నేతలు తనకు సహకారం అందించాలని కోరారు. కొత్తగా ఏర్పడ్డ కోనసీమ జిల్లాలో మౌలిక వసతుల కల్పన, సాంకేతిక పరిజ్ఞానంతో పాటు సిబ్బంది సమస్యలను అధిగమించేలా పని చేస్తానని స్పష్టం చేశారు. ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన కృష్ణారావును డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో పాటు ఎస్పీ కార్యాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతించారు. తొలుత ఆయన పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు.



ఎస్పీ కృష్ణారావుకు స్వాగతం పలుకుతున్న అదనపు ఎస్పీ ఖాదర్‌బాషా



ఎస్పీ కృష్ణారావును మర్యాదపూర్వకంగా కలిసిన కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ

## అయినవిల్లిలో ఎస్పీ పూజలు

అయినవిల్లి, జూలై 17: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించే ముందు బొడ్డేపల్లి కృష్ణారావు తొలి ఏకాదశి సందర్భంగా అయినవిల్లి శ్రీవిఘ్నేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. తొలుత ఎస్పీకి అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదాశీర్వచనం చేసి శేష వస్త్రంతో సత్కరించి, తీర్థ ప్రసాదాలు, స్వామివారి చిత్రపటం అందజేశారు.



ఎస్పీకి ఆలయ మర్యాదలతో స్వాగతం పలుకుతున్న అర్చకులు



## నిండు శోకంతో...

కర్బలా పుణ్యభూమిలో అశువులు బాసిన ఇమామ్ హుస్సేన్, అతని 72 మంది పరివారానికి రక్త తర్పణం చేస్తూ ముస్లింలు నిండు శోకంతో బుధవారం మొహర్రం నిర్వహించారు. ద్రాక్షారామ, మామిడికుదురు మండలం నగరంలో కత్తులు, బ్లేడులు, గొలుసులతో హుస్సేన్ హుస్సేన్ అంటూ తమ శరీరాన్ని గాయపరుచుకుని రక్తం చిందిస్తూ మాతం నిర్వహించి వారికి మన నివాళులర్పించారు. పీర్లు, గుమ్మటాలను పురవీధుల్లో ఊరేగిస్తూ నిండు శోకంతో ఇమామ్ హుస్సేన్ అతని పరివారానికి అంజలి ఘటించారు. పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ నగరంలో గుమ్మటాన్ని మోసి పీర్లను దర్శించుకుని ప్రార్థనలు చేశారు (పక్క చిత్రం).... 7లో

# శోకతప్త హృదయాలతో..


నగరంలో మాతం నిర్వహిస్తున్న ముస్లింలు

**మొహర్రం సందర్భంగా రక్తం చిందించిన ముస్లింలు**

**మాతం నిర్వహించి అమరవీరులకు నివాళులు**


మొహర్రం సందర్భంగా పీర్లు ఊరేగిస్తున్న ముస్లిం భక్తులు

మామిడికుదురు, జూలై 17: కర్బలా పుణ్యభూమిలో అసువులు బాసిన ఇమామ్ హుస్సేన్, అతని 72 మంది పరివారానికి రక్త తర్పణం చేస్తూ ముస్లింలు నిండు శోకంతో బుధవారం మొహర్రం నిర్వహించారు. ఇమామ్ హుస్సేన్ అమరత్వం పొందిన రోజులను పురస్కరించుకుని ముస్లిం భక్తులు కత్తులు, బ్లేడులు, గొలుసులతో హుస్సేన్ హుస్సేన్ అంటూ తమ శరీరాన్ని గాయపరుచుకుని రక్తం చిందిస్తూ మాతం నిర్వహించి వారికి ఘన నివాళులర్పించారు. మొహర్రాన్ని పురస్కరించుకుని నగరం, మామిడికుదురు గ్రామాల్లో 40 పంజాల నుంచి పీర్లు, గుమ్మటాలను గ్రామ పురవీధుల్లో ఊరేగిస్తూ నిండు శోకంతో ఇమామ్ హుస్సేన్ అతని పరివారానికి అంజలి ఘటించారు. మత ప్రబోధకుడు సయ్యద్ అలీజాఫరీ పవిత్ర యుద్ధ భూమిలో ఇమామ్‌హుస్సేన్, అతని పరివారం మరణించిన తీరును భక్తులకు వివరించగా భక్తులు గుండెలు బాదుకుంటూ కన్నీరు మున్నీరుగా విలపించారు. నగరం మంజిలే కర్బలా నుంచి పెదపంజీష వరకు రక్తం చిదిస్తూ మాతం నిర్వహించారు. పెదపంజీషలో ఇమామ్‌హుస్సేన్, అతని పరివారం అమరత్వం పొందిన సంఘటనను మజ్లిస్ రూపంలో వివరించి అనంతరం షహదత్ మజ్లిస్ జరిగింది. అనంతరం నగరంలోని పీర్ల చెరువులో పీర్లను శాంతింప చేశారు. మొహర్రం కార్యక్రమంలో పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పాల్గొని గుమ్మటాన్ని మోసి పీర్లను దర్శించుకుని ప్రార్థనలు చేశారు. రాష్ట్రం నలుమూలలు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులకు అంజుమానే హుస్సేనీ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.


ద్రాక్షారామలో మాతం నిర్వహిస్తున్న ముస్లింలు

## నిండు శోకంతో..

ద్రాక్షారామ,జూలై 17: రామచంద్రపురం మండలం ద్రాక్షారామలో బుధవారం మొహర్రంను ముస్లింలు నిండుశోకంతో జరుపుకున్నారు. మహమ్మద్ ప్రవక్త మనుమడు హజరత్ ఇమాం హుస్సేన్ సంతాపదినాలు బుధవారం సాయంత్రంతో ముగిసాయి. ఈనెల 7న నెలవంక దర్శనంతో సంతాప దినాలు ప్రారంభించారు. 11 రోజుల పాటు ముస్లింలు సంతాప దినాలు నిండు శోకంతో జరుపుకున్నారు. త్యాగాలను స్మరించుకుంటూ పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఇమాం హుస్సేన్ వీరమరణం పొందిన రోజైన మొహర్రం రోజు ఉదయం ముస్లింలు ప్రత్యేక నమాజ్ చేశారు. పెద్ద మసీదు సెంటర్ నుంచి హజరత్ అబ్బాస్ రోడ్డు వరకు అమరులకు శ్రద్ధాంజలి ఘటిస్తూ తమ వీపుపైన ఛాతిపైన, శిరస్సుపైన గాయాలు చేసుకుని మాతం(రక్తతర్పణం) చేసి ఇమాం హుస్సేన్‌పై భక్తిని చాటుకున్నారు. మొక్కుబడులు సమర్పించారు. పీరులను చెరువు వద్దకు తీసుకువెళ్లి కడిగి శాంతింపచేశారు. కర్ణాటక నుంచి వచ్చిన అష్గర్ అబేది సాహెబ్ మజ్లిస్ బోధించారు. మంగళవారం రాత్రి తల్లి పీరు ఊరేగింపు ప్రధాన ఘట్టంగా జరిగింది.



## ముత్యాలమ్మతల్లికి సారె సమర్పణ

కడియం, జూలై 17: వేమగిరి గ్రామస్థుల ఆడపడుచుగా, గ్రామదేవతగా, భక్తుల పాలిట కల్పవల్లిగా పూజలు అందుకుంటున్న ముత్యాలమ్మ వారికి ఆషాఢమాసం సందర్భంగా బుధవారం తొలి ఏకాదశిని పురస్కరించుకుని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ముత్యాలమ్మ దిబ్బ మీద ఉన్న ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, చీరలు, గాజులు, 200 కిలోల స్వీట్లు సమర్పించారు. పురవీధుల గుండా అమ్మవారిని ఊరేగించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## నిలకడగా ఆర్.నారాయణమూర్తి ఆరోగ్యం

రౌతులపూడి, జూలై 17: సినీ నటుడు ఆర్.నారాయణమూర్తి ఆరోగ్యం నిలకడగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. రెండు రోజులు నుంచి హైదారాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ఆయన చికిత్స పొందుతున్నారు. విషయం తెలిసి బంధువులు, అభిమానులు నారాయణమూర్తి సొంత గ్రామం మల్లంపేట చేరుకుని ఆయన ఆరోగ్యంపై వాకబు చేస్తున్నారు. దీంతో సోదరుడు రెడ్డి బుల్లాబ్బాయి మాట్లాడుతూ ఆర్.నారాయణమూర్తి పేగు సంబంధిత సమస్యతో ఆసుపత్రిలో ఉన్నారని ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగా ఉందని తెలిపారు.

# బైక్‌పై నుంచి పడి నాలుగేళ్ల బాలుడి మృతి

**మరో ఇద్దరికి తీవ్రగాయాలు**

**రెండు కుటుంబాల్లో పెను విషాదం**

**దైవదర్శనానికి వెళ్లి వస్తుండగా ప్రమాదం**


రియాన్స్ మృతదేహం


రియాన్స్ (ఫైల్‌ఫొటో)

కరప, జూలై 17: దైవదర్శనానికి వెళ్లి ఆనందంగా తిరిగొస్తున్న ఆ రెండు కుటుంబాల్లో రోడ్డు ప్రమాదం పెను విషాదాన్ని నింపింది. ఈ ప్రమాదంలో నాలుగేళ్ల బాలుడు మృతిచెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కరప మండలం వేళంగి-కూరాడ రోడ్డులో రైల్వే ట్రాక్ వద్ద బుధవారం సాయంత్రం జరిగిన ఈ దుర్ఘటనకు సంబంధించి కరప పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రావులపాలెం మండలం ఎదురేశ్వరం గ్రామానికి చెందిన కర్రి సూర్యభాస్కర్‌రెడ్డి ఫైనాన్స్ వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కాకినాడ రూరల్ మండలం కొవ్వూరు గ్రామంలో ఇటీవల ప్రతిష్ఠించిన వారాహి అమ్మవారిని దర్శించుకునేందుకు బుధవారం అతని భార్య అలేఖ్య, కుమారుడు రియాన్స్(4), సోదరి కర్రి ధనలక్ష్మి, ఆమె కుమారుడు 15 ఏళ్ల స్వప్నిత్‌రెడ్డిలతో కలిసి రెండు ద్విచక్ర వాహనాలపై బయలుదేరారు. వారాహిమాత దర్శనం ముగించుకుని స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. కూరాడ రైల్వే గేటు దాటాక మోటర్‌సైకిల్ డ్రైవ్ చేస్తున్న కర్రి ధనలక్ష్మి తాటి దుంగలు లోడుతో ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను ఓవర్‌టేక్ చేసింది. అయితే వర్షం పడి బురదతో నిండిన గొయ్యిని తప్పించబోయి ఆమె బండితో సహా రోడ్డుపై పడిపోయింది. ఈ ప్రమాదంలో ఇదే బండిపై ఉన్న సోదరుడి కుమారుడు రియాన్స్ తలకు తీవ్రగాయం కాగా, ధనలక్ష్మి, ఆమె కుమారుడు స్వప్నిత్‌రెడ్డిలకు నడుము, రిబ్స్, చేతులు విరిగి తీవ్రంగా గాయపడ్డారు. రియాన్స్‌ను రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. క్షతగాత్రులు ధనలక్ష్మి, స్వప్నిత్‌రెడ్డిలు కాకినాడలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కళ్ల ముందు కొడుకు మృతిచెందడంతో తట్టుకోలేని సూర్యభాస్కర్‌రెడ్డి, అలేఖ్య దంపతులు కన్నీరుమున్నీరుగా విలపించారు. కరప ఎస్ఐ తూపాటి రామకృష్ణ ఘటనాస్థలికి చేరుకుని విచారణ చేపట్టారు. అలాగే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుల వద్దకు వెళ్లి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వివరించారు.

## ఘనంగా తొలి ఏకాదశి పూజలు


మహావిష్ణువుకు పూజలు

సామర్లకోట, జూలై 17: ఆషాఢమాసం తొలి ఏకాదశి మహాపర్వదినం సందర్భంగా పంచారామ పుణ్యక్షేత్రమైన సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయంలో బుధవారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలోని మహావిష్ణువు, లక్ష్మీదేవి అమ్మవార్లకు ఆలయ కార్యనిర్వహణాధికారి బళ్ళ నీలకంఠం ఆధ్వర్యంలో వేద పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, అంజిబాబు, వెంకన్న, శ్రీనివాసరావు, వినయ్ విశేష అభిషేక పూజలు నిర్వహించారు. పుష్పార్చన పూజలు అనంతరం స్వామి వారిని, అమ్మవారిని నూతన పట్టువస్త్రాలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని దర్శించి ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఆవరణలో దేవదాయ శాఖ నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకంలో సుమారు 600 మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయం వెలుపల గల భీమేశ్వరా అన్నదాన ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదానంలో సుమారు 500 మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

## బాలికపై అత్యాచారం

**ఇద్దరు యువకుల అరెస్టు**

రాజమహేంద్రవరం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మాయమాటలతో బాలికను లొంగదీసుకొని శారీరక వాంఛ తీర్చుకున్న యువకుడితో పాటు అతడికి సహాయం చేసిన స్నేహితుడిని కూడా టూటౌన్ పోలీసులు కటకటాల్లోకి నెట్టారు. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. బొమ్మూరు పరిధిలో నివసిస్తున్న ఓ కుటుంబంలోని 15 ఏళ్ల బాలిక పదో తరగతి చదువుతోంది. నాలుగు నెలలుగా ప్రేమ పేరుతో తూము ముత్యాలరావు(ముత్యాలు) అనే యువకుడు వెంటపడుతున్నాడు. పరిచయం ఏర్పడి ఇన్‌స్టాగ్రాంలో చాటింగ్ చేసుకుంటున్నారు. ఈ క్రమంలో బయటికి వెళ్దామంటూ ఆ బాలికను ఒప్పించాడు. ఈ నెల 15న స్కూలు నుంచి ఆ బాలికను స్నేహితుడు గుత్తుల వీరబ్రహ్మం(వీరబాబు)తో కలిసి బైక్‌పై వేమగిరిలోని తన ఇంటికి తీసుకెళ్లారు. వీరబ్రహ్మం వెళ్లిపోగా..ఆ బాలికకు మాయమాటలు చెప్పి ముత్యాలు లొంగదీసుకొని శారీరక వాంఛ తీర్చుకున్నాడు. సాయంత్రం ఆమెను ఇంటి సమీపంలో వదిలి వెళ్లాడు. బాలిక ప్రవర్తనలో మార్పును గమనించి తల్లిదండ్రులు ప్రశ్నించగా అఘాయిత్యం బయట పడింది. వారు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని సీఐ తెలిపారు. పోక్సో కేసు నమోదు చేసి ముత్యాలుతో పాటు అతడికి సహకరించిన వీరబ్రహ్మన్ని అరెస్టు చేశామని.. సెల్‌ఫోన్, బైక్‌ను స్వాధీనం చేసుకున్నామని సౌత్‌జోన్ డీఎస్పీ అంబికా ప్రసాద్ పేర్కొన్నారు. 2021లో ఒక హత్యా నేరం కేసులో ముత్యాలు బెయిల్‌పై ఉన్నాడన్నారు. అతడిపై రాజానగరం పోలీస్‌స్టేషన్లో రౌడీషీట్ కూడా ఉందని డీఎస్పీ వివరించారు.

## అధ్యాపకునిపై పోక్సో కేసు

అడ్డతీగల, జూలై 17: అడ్డతీగల ప్రభుత్వ జూనియర్ కళాశాల కామర్స్ అధ్యాపకునిపై పోక్సో ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసినట్లు అడ్డతీగల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపారు. అదే కళాశాలలో సీనియర్ ఇంటర్ చదువుతున్న విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడనే ఆరోపణ రావడంతో కేసులు నమోదు చేశామన్నారు. తనను వేధిస్తున్నట్లు సదరు విద్యార్థిని స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించిందన్నారు. దీనిపై చింతూరు ఏఎస్పీని విచారణ అధికారిగా జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్ నియమించినట్లు సీఐ తెలిపారు.

# లోవ దేవస్థానంలో విశేష పూజలు


లక్ష్మీగణపతి హోమం నిర్వహిస్తున్న దృశ్యం


లక్ష తులసి అర్చన


ఆలయంలో ఎమ్మెల్యే బుచ్చిబాబు

తుని రూరల్,జూలై 17: ప్రసిద్ధి పుణ్యక్షేత్రం లోవ దేవస్థానంలో ఆషాఢ మాసోత్సవాలను పురస్కరించుకుని తొలి ఏకాదశి పర్వదినాన అమ్మవారికి విశేష పూజాధి కార్యక్రమాలను ఆలయ పండితులు నిర్వహించారు. ఆలయంలో ముందుగా కైలాస గణపతి స్వామి వారికి విశేష అభిషేకాలు నిర్వహించారు. లక్ష్మీగణపతి హోమం నిర్వహించి ప్రధాన ఆలయంలో తలుపులమ్మ అమ్మవారికి లక్ష తులసి పూజను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని తొలి ఏకాదశి పూజలు నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ ఈవో పి.విశ్వనాథరాజు ప్రత్యేక ఏర్పాట్లు చేసి తీర్థ ప్రసాదాలు అందించారు.

**తలుపులమ్మ అమ్మవారి సేవలో ముమ్మిడివరం ఎమ్మెల్యే**

ప్రసిద్ధి పుణ్యక్షేత్రం తలుపులమ్మ దేవస్థానంలో ముమ్మడివరం శాసన సభ్యులు దాట్ల సుబ్బారాజు (బుచ్చిబాబు) అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలకగా పూజలు అనంతరం ఆలయ పండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. అనంతరం ఆయనకు అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు.

## పాదగయలో నందీశ్వరునికి పూజలు


నందీశ్వరునిపై ఉత్సవమూర్తులు కొలువైన దృశ్యం

పిఠాపురం, జూలై 17: కాకినాడ జిల్లా పిఠాపురంలోని పాదగయ క్షేత్రంలో వేంచేసి ఉన్న రాజరాజేశ్వరీ సమేత ఉమాకుక్కుటేశ్వరస్వామి సన్నిధిలో కొలువై ఉన్న నందీశ్వరునికి బుధవారం ప్రత్యేక పూజలు జరిగాయి. తొలిఏకాదశి సందర్భంగా నందీశ్వరుడికి పుష్పాలు, వస్త్రాలతో విశేష అలంకారం చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను నందీశ్వరునిపై ఆశీనులు చేశారు. భక్తులు నందీశ్వరుని చుట్టూ ప్రదక్షిణలు చేశారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. కార్యక్రమాల్లో ఆలయ కార్యనిర్వహణాధికారి, సహాయ కమిషనరు దుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి డీఎల్‌ఎంటీలకు శిక్షణ తరగతులు

సామర్లకోట, జూలై 17: గ్రామాల్లో సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు ప్రభుత్వ ఆదేశాల మేరకు కాకినాడ జిల్లా సామర్లకోట విస్తరణ శిక్షణా కేంద్రం ఆవరణలో డీఎల్ఎంటీలకు ఈ నెల 18 గురువారం నుంచి మూడు రోజుల పాటు శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నట్లు ఈటీసీ ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ వెల్లడించారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం విలేకరులతో ప్రిన్సిపాల్ వేణుగోపాల్ మాట్లాడుతూ ఈ శిక్షణా తరగతులు తొమ్మిది రోజుల పాటు జరుగుతాయన్నారు. ఒక్కో బ్యాచ్‌కు మూడు రోజులు చొప్పున రెసిడెన్షియల్ పద్ధతిన శిక్షణా తరగతులు నిర్వహించనుండగా 11 జిల్లాల నుంచి మూడు బ్యాచ్‌లుగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. మూడు బ్యాచ్‌లుగా విభజించి నిపుణులు శిక్షణ ఇస్తారని ఈ సందర్భంగా చెప్పారు. జిల్లాలో వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు ఈ శిక్షణా తరగతులకు హాజరై వివిధ అంశాలను వివరిస్తారని ప్రిన్సిపాల్ వేణుగోపాల్ చెప్పారు.

# కలెక్టర్ మాధవీలత అక్రమాలపై విచారణ జరపాలి

**రాష్ట్ర ప్రభుత్వానికి బర్రే ఆనంద్ కుమార్ ఫిర్యాదు**


మాట్లాడుతున్న ఆనంద్‌కుమార్

రాజమహేంద్రవరం సిటీ, జూలై 17: తూర్పుగోదావరి జిల్లాకు తొలి కలెక్టర్ గా పనిచేసిన డాక్టర్ మాధవీలత ఒక కలెక్టర్‌గా కాకుండా వైసీపీ కార్యకర్తగా విధులు నిర్వర్తించడంతో ఆమె అవినీతి అక్రమాలపై కూటమి ప్రభుత్వం విచారణ జరపాలని స్వతంత్ర జనతా(రిపబ్లిక్) పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బర్రే ఆనంద్ కుమార్ డిమాండ్ చేశారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన మాధవీలత చేసిన అవినీతి, అక్రమాలపై సీఎంకు ఫిర్యాదు చేస్తున్నామన్నారు. రాజానగరం మండలంలో శ్రీకృష్ణపట్నంలో సుమారు 89 ఎకరాల సీలింగ్ భూమి ఉందని అది నిరుపేదలకు చెందాల్సిన భూమి అని సుప్రీంకోర్టు సైతం తీర్పు ఇచ్చిందని అయినప్పటికి ఆ సర్వే నెంబర్లను బ్లాక్‌లో పెట్టడం తప్ప అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని , తక్షణమే ఆ భూమిని ప్రభుత్వం తమ ఆధీనంలోకి తీసుకొని పేదలకు పంచాలని 2022 జూన్ 6వ తేదీన కలెక్టర్ గ్రీవెన్స్ సెల్‌కి వెళ్లి ఆధారాలతో సహ ఫిర్యాదు చేశానని చెప్పారు. అయితే కలెక్టర్ ప్రభుత్వ సీలింగ్ భూములను కేవలం వారం రోజులకే ప్రైవేటు వ్యక్తి ధారాదత్తం చేసే విధంగా మొత్తం సర్వే నెంబర్లను బ్లాక్‌లో నుంచి తీయించేశారని ఆరోపించారు. పేదలకు చెందాల్సిన ప్రభుత్వ భూములు కొంత మంది ప్రైవేటు వ్యక్తులు అమ్ముకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారని తెలిసిందని అందువల్ల తక్షణమే విచారణ చేయాలని కోరుతున్నామన్నారు. విస్సాకోటి శ్రీను, విజ్జిన వీర్రాజు, కొత్తపల్లి మహేష్, విజ్జిన రాంబాబు, డేగపాటి ప్రశాంత్ కుమార్, వేమవరపు రాజు, కాకి హనుమంతరావు, వందే లక్ష్మణరావు పాల్గొన్నారు.

## సత్యదేవుడి సన్నిధిలో ఎస్పీ పూజలు


ఎస్పీకి ప్రసాదం అందిస్తున్న పీఆర్వో కృష్ణారావు

అన్నవరం, జూలై 17: రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో కాకినాడ జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన విక్రాంత్ పాటిల్ బుధవారం స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ పీఆర్వో కృష్ణారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనాలు అందజేయగా పీఆర్వో కృష్ణారావు స్వామివారి ప్రసాదం అందించారు.

## భారీ కొండచిలువ హతం



జగ్గంపేట రూరల్,జూలై 17: కాకినాడ జిల్లా జగ్గంపేట మండలంలోని కాండ్రేగుల గ్రామంలో కామర కొండపై 15 అడుగుల కొండ చిలువను మేకల కాపర్లు హతమార్చారు. గ్రామానికి చెందిన కొంత మంది కామర కొండపై మేకలు మేపుతుండగా అకస్మాత్తుగా కొండచిలువ ఒక మేకను చుట్టుకుని తినేందుకు ప్రయత్నించింది. మేకల అరుపులు విన్న మేకల కాపర్లు వెంటనే ఘటనా స్థలానికి వెళ్లి చూడగా మేకను మింగేందుకు కొండ చిలువ మేకను చుట్టుముట్టింది. ఇది గమనించిన స్థానికులు మేకల కాపర్లు ఆ కొండ చిలువను కత్తులతో హతమార్చారు. మేక కొండచిలువ దాడిలో చనిపోయింది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు చూసేందుకు అధిక సంఖ్యలో వచ్చారు.

# 27న ఎస్సీ, ఎస్టీ సదస్సు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కాకినాడ సిటీ, జూలై 17: భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులు, ఆదేశ సూత్రాలు, ప్రాథమిక విధులపై అందరికీ అవగాహన కల్పించేందుకు ఈనెల 27న కాకినాడలోని డీ కన్వెన్షన్ హాల్‌లో 17వ రాష్ట్రస్థాయి ఎస్సీ, ఎస్టీ సదస్సు నిర్వహిస్తామని అంబేడ్కర్ ఆలోచనా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, ప్రముఖ న్యాయవాది పినిపే వెంకటరామకృష్ణ తెలిపారు. కాకినాడ ఇంద్ర పాలెం లాకుల వద్దగల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి బుధవారం పూలమాలలు వేసి నివాళులర్పించి సదస్సు పోస్టర్ ఆవిష్క రించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ స్వాతంత్ర్యం సిద్ధించి వందేళ్లకు దగ్గర వుతున్నా దళిత, గిరిజన ప్రజలు పూర్తిస్థాయిలో అంబేడ్కర్ అందించిన రాజ్యాంగ ఫలాలు పొంద లేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా స్వామ్య వ్యవస్థలో దళిత, గిరిజన సామాజికవర్గాల ప్రాధాన్యం సంపాదించుకునేలా అంబేడ్కర్ ఆలోచనా ఫౌండేషన్ పదేళ్లుగా విశేష కృషి చేస్తో ందన్నారు. ఈ సదస్సుకు రాష్ట్ర వ్యాప్తంగా న్యాయ మూర్తులు, న్యాయవాదులు, విశ్రాంత వైద్యనిపుణులు, సమాజం పట్ల అవగాహన కలిగి మార్పుకోసం తపించే వివిధ రంగాల ప్రముఖులు హాజరుకానున్నారని ఏఏఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు వెంకటరామకృష్ణ తెలిపారు. దళిత సత్తా నాయకులు బచ్చల కామేశ్వరరావు, పిల్లి శివకుమార్ పాల్గొన్నారు.

## రత్నగిరిపై తొలి ఏకాదశి రద్దీ


క్యూలో వేచి ఉన్న భక్తులు

అన్నవరం, జూలై 17: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో బుధవారం తొలి ఏకాదశి పర్వదినం, ప్రభుత్వ సెలవు దినం కావడంతో భక్తులతో రద్దీ నెలకొంది. రాష్ట్రంలో వివిధ ప్రాంతాలనుంచి స్వామిని దర్శించి వ్రతాలు ఆచరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. స్వామివారి ప్రత్యేక దర్శనానికి రెండు గంటలు, ఉచిత దర్శనానికి మూడు గంటల సమయం భక్తులు వేచి ఉన్నారు. బుధవారం ఒక్కరోజు సుమారు 3 వేల వ్రతాలు జరగగా వివిధ విభాగాల ద్వారా రూ.35 లక్షలు ఆదాయం సమకూరింది.

## అదుపు తప్పిన ఐషర్ వ్యాన్

**డ్రైవర్ మృతి**

ప్రత్తిపాడు, జూలై 17: ప్రత్తిపాడు పాదాలమ్మ తల్లిగుడి వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐషర్ వ్యాన్ డ్రైవర్ మృతి చెందాడు. పోలీసులు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. తుని నుంచి రాజమండ్రి వైపు వస్తున్న ఐషర్ వ్యాన్ స్థానిక పాదాలమ్మ తల్లి గుడి వద్దకు రాగానే అదుపు తప్పి గోతులో పడి కాలువలోకి దూసుకువెళ్లింది. ఈ ప్రమాదంలో బొమ్మూరుకు చెందిన డ్రైవర్ బొంతు నాగేశ్వరరావు(49)కు తలకు బలమైన గాయాలు కావడంతో వ్యాన్‌లోనే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి ఎస్ఐ ఎం.పవన్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





## పొల్లూరు జలపాతం వద్ద పర్యాటకుల సందడి

మోతుగూడెం,జూలై 17: చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో ఉన్న పొల్లూరు జలపాతం ఉరకలేస్తూ పర్యాటకులను ఆకట్టుకుంటోంది. ఏజెన్సీ వ్యాప్తంగా విస్తృతంగా వర్షాలు కురవడంతో జలపాతం ఉరకలేస్తుంది. సుమారు 50 అడుగులు పై నుంచి వేగం నీటి ప్రవాహం కిందకు పడుతుంది. దీంతో పర్యాటకులు జలపాతం వద్ద సరదాగా గడిపేందుకు పర్యాటకులు ఆసక్తి చూపుతున్నారు. బుధవారం సెలవు కావడంతో జలపాతానికి పెద్ద సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. దీంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు జలపాతం వద్ద పర్యాటకుల సందడి కనిపించింది.

## పెరుగుతున్న గోదావరి

ధవళేశ్వరం,జూలై 17: ఉపనది ఇంద్రావతి నుంచి వరద ప్రవాహం గోదావరిలో కలుస్తూ ఉండటంతో భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. దీంతో ఎగువ నుంచి వచ్చి చేరే ప్రవాహాన్ని అంచనా వేస్తూ కాటన్ బ్యారేజ్ గేట్ల ద్వారా 93244 క్యూసెక్కులను సముద్రంలోకి విడుదల చేస్తూ గోదావరి బేసిన్‌ను ఖాళీ చేస్తున్నారు. బుధవారం సాయంత్రానికి ధవళేశ్వరం వద్ద నీటి మట్టం 10.65 అడుగులుగా నమోదయింది. వ్యవసాయ అవసరాల కోసం తూర్పుడెల్టాకు 3 వేల క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 1700 క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 4 వేల క్యూసెక్కులు చొప్పున సాగునీటిని విడుదల చేస్తున్నారు.

## గోడిలంకలో మెగా నేత్ర వైద్య శిబిరం

అల్లవరం, జూలై 17: యూఎస్‌ఏ గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గోడిలంకలో బుధవారం మెగా ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. అకిరా ఆసుపత్రి వైద్యులు డాక్టర్ ప్రకాష్, చంటిబాబు ఆధ్వర్యంలో 270మందిని పరీక్షించి 111మందికి ఉచితంగా కళ్లజోళ్లు అందించారు. 14మందిని ఆపరేషన్ నిమిత్తం తరలించారు. సర్పంచ్ రుద్రరాజు పవిత్ర, రుద్రరాజు లక్ష్మీపతిరాజు, వేగిరాజు శ్రీనురాజు, దాట్ల గోపిరాజు, నడింపల్లి రామరాజు, ఆర్.దత్తుడురాజు, నాతి శ్రీనివాసరావు, శెట్టిబత్తుల తులసీదుర్గారావు పాల్గొన్నారు.

## ఏకలవ్యుడి జయంతి వేడుకలు


అంబాజీపేటలో ఏకలవ్యుడికి నివాళి

అమలాపురం టౌన్, జూలై 17: పట్టణ పరిధిలోని 27వ వార్డులో బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లా పవన్‌కుమార్ ఏకలవ్యుని చిత్రపటానికి పుష్పాలంకరణ చేశారు. ఎరుకల సోదరుల సమక్షంలో కేక్ కట్ చేశారు. ఏకలవ్యుని జయంతిని అధికారిక సెలవు దినంగా ప్రకటించాలని సంఘ నాయకులు కోరారు. మన్నే జ్యోతి, బండి తేజస్విని, శీలం ఏడుకొండలు, సజ్జా సూరిబాబు, అంజనేయులు, మాణిక్యం పాల్గొన్నారు.

**కె.గంగవరం:** అముజూరులో బుధవారంఏకలవ్యుడి జయంతి వేడుకలు ఎరుకల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఏకలవ్యుడి చిత్రపటానికి నివాళులర్పించారు. ఎరులక సంఘాలకు మండలంలో నాలుగు కమ్యూనిటీ హాల్స్ మంజూరు చేయాలని, అముజూరులో ఏకలవ్యుడి విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవడానికి స్థలం కేటాయించాలని కోరారు. ఎరుకల సంఘం నాయకులు బెల్లంకొండ గోవిందు, సంగడాల రాజు, అమలదాసు రాంబాబు, అమలదాసు తాతబ్బాయి, మానుపాటి వీరబాబు పాల్గొన్నారు.

**పి.గన్నవరం:** పి.గన్నవరం త్రిరోడ్ సెంటర్‌లో మండల ఏకలవ్య ఎస్టీ ఎరుకల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏకలవ్యుడి జయంతి వేడుకలు జరుపుకున్నారు. ఏకలవ్యుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏకలవ్య ఎస్టీ ఎరుకల సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు బండారి మాసేరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జేఏసీ నాయకులు కోట రామ్మోహనరావు, వివిధ పార్టీల నాయకులు సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, శేరు శ్రీనుబాబు, తాటికాయల శ్రీనివాసరావు, దైవాల రాంబాబు, కర్రి బాబూరావు, సంఘ సభ్యులు మాచగిరి మునసయ్య, మానుపాటి శివకోటేశ్వరావు, గాడ నాగప్రసాద్ పాల్గొన్నారు.

**అంబాజీపేట:** మహాభారతంలో గురుభక్తిని చాటిన గొప్ప వ్యక్తి ఏకలవ్యుడని ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు కె.నరహరవరప్రసాద్ అన్నారు. ఎరుకుల సంఘం మండల నాయకుడు మానుపాటి గోవింద్ ఆధ్వర్యంలో ఏకలవ్యుడి జయంతి నిర్వహించారు. స్థానిక బస్టాండ్ వద్ద ఆయన విగ్రహానికి నాయకులు నివాళులర్పించారు. సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, నాయకులు గణపతి వీరరాఘవులు, కొర్లపాటి గోపి, నాగాబత్తుల సుబ్బారావు, దొమ్మేటి సత్యమోహన్, గాడా గణేష్, భారతి వాసు, మానుపాటి రమేష్, కోసూరి ఆనందరావు, గాడా మన్నెయ్య, భారతి నాగబాబు పాల్గొన్నారు.

**మండపేట:** నేటి తరాలకు స్ఫూర్తి ప్రదాత ఏకలవ్యుడని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. స్థానిక 26వ వార్డు గాంధీనగర్ కాల్వగట్టున ఏకలవ్యుడి జయంతి వేడుకలు నిర్వహించారు. ఏకలవ్యుడి చిత్రపటానికి వేగుళ్ల నివాళులర్పించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, ఎరుకల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు అమలదాసు రుద్రమూర్తి, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కోటి పల్లి సాయిరాం, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోనా సత్యనారాయణ, ఏండీ ఖాదిరి, దూళి జయరాజు, కాటా గోపి, గుండు తాతరావు, పాలచర్ల శిరీష పాల్గొన్నారు.

**రాయవరం:** మండలానికి నాలుగు సామాజిక భవనాలు నిర్మించాలని ఏపీ ఎరుకల కులస్థుల సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాఅధ్యక్షుడు మానుపాటి రామకృష్ణ డిమాండ్ చేశారు. రాయవరంలో ఏకలవ్య ఎరుకల సంఘం ఆధ్వర్యంలో ఏకలవ్యుడి జయంతి నిర్వహించారు. ఏకలవ్యుడి చిత్రపటానికి నివాళులర్పించారు. జిల్లా సెక్రటరీ సమతం పాపారావు, ఉమ్మడి జిల్లా గౌరవ సలహాదారు వలపు ప్రసాద్, మండల ప్రెసిడెంట్ ఎస్.శ్రీను, సెక్రటరీ జి.రామచంద్ర, ట్రెజరర్ ఎస్.నూకరాజు, జాయింట్ సెక్రటరీ ఎల్.ఏసుబాబు, ఎరుకల కులస్థులు పాల్గొన్నారు.

**ఉప్పలగుప్తం:** ఏకలవ్య ఎరుకల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉప్పలగుప్తంలో ఏకలవ్యుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘం అధ్యక్షుడు దాసరి శ్రీనివాసరావు, కార్యదర్శి గాడా రమేష్, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు, కూటమి నాయకులు ఇసుకపట్ల రఘుబాబు, ఆకుల సూర్యనారాయణమూర్తి, చిక్కం సూర్యమోహన్, సలాది శ్రీనివాసరావు, గాలిదేవర సురేష్, ఎస్ఐ ఎం.మనోహర్‌జోషీ, చిక్కం బాలయ్య, ఎరుకల సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# వైభవంగా తొలి ఏకాదశి పూజలు


అమలాపురం:సత్తెమ్మతల్లి రాయవరం: విజయదుర్గమ్మ, యానాం: వేంకటేశ్వరస్వామి, ఆలమూరు: శ్రీకృష్ణుడు, పి.గన్నవరం:వేంకటేశ్వరస్వామి, ఆత్రేయపురం: వేంకటేశ్వరస్వామి

అయినవిల్లి, జూలై 17: అయినవిల్లి శ్రీసిద్ధివినాయక ఆలయానికి భక్తులు పోటెత్తారు. బుధవారం తొలి ఏకాదశి సందర్భంగా సుదూర ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. కేశవస్వామి, విశ్వేశ్వరస్వామి, అన్నపూర్ణాదేవి, కాలభైరవ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అయినవిల్లి వీధులు వాహనాలతో కిక్కిరిశాయి. స్వామివారి దర్శనానికి రెండు గంటల సమయం పట్టిందని భక్తులు తెలిపారు. ముక్తేశ్వరం నుంచి అయినవిల్లి వరకు భక్తుల రద్దీ పెరగడంతో ట్రాఫిక్ జామ్ అయి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. అధిక సంఖ్యలో భక్తులు అన్నసమారాధనలో పాల్గొన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా దేవస్థానం ఈవో ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో సిబ్బంది సేవలు అందించారు.

**ముమ్మిడివరం:** తొలి ఏకాదశి పర్వదినాన్ని బుధవారం భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయాన్నే ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. ముమ్మిడివరంలోని శ్రీదేవి, భూదేవి సమేత కేశవస్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామి, అమ్మవార్లను వివిధ రకాల పుష్పాలు, తులసిమాలలతో అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. పళ్లవారిపాలెంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం, పలు గ్రామాల్లోని విష్ణాలయాలు, వేంకటేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

**ఆలమూరు:** మండలంలో ప్రసిద్ధి చెందిన ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలమూరులో నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణుడి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. పలువురు రైతులు తమ భూముల్లో తెల్లవారుజామున ప్రత్యేక పూజలు చేశారు.

**పి.గన్నవరం:** లంకలగన్నవరంలో శ్రీభూదేవి అలివేలు మంగా సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు మారుతి ఆచార్యులు ఆధ్వర్యంలో స్వామి అమ్మవార్లకు విశేషపూజలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

**రాయవరం:** మండలంలోని 12గ్రామాల్లో తొలి ఏకాదశి పూజలు బుధవారం ఘనంగా నిర్వహించారు. రాయవరం శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి తులసిదళ అర్చనలు జరిపి హారతులు ఇచ్చారు. లొల్ల, సోమేశ్వరం, పసలపూడి గ్రామాల్లో ఉన్న రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో తొలిఏకాదశి పూజలు జరిగాయి. వెదురుపాక శ్రీదేవి భూదేవి సమేత జనార్ధనస్వామి ఆలయంలో అంగర సూర్యనారాయణాచార్యులు, అంగర జనార్ధనాచార్యులు ఆధ్వర్యంలో తొలి ఏకాదశి పూజలు చేశారు. వెదురుపాక విజయదుర్గా పీఠంలో విజయ వేంకటేశ్వరస్వామికి తులసిదళ అర్చనలు, హారతులు జరిపి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

**మండపేట:** తొలి ఏకాదశి పురస్కరించుకుని పట్టణంలోని వాసవిమాత అమ్మవారి ఆలయంలో బుధవారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. వ్రతాల్లో 150మంది దంపతులు పాల్గొన్నారు. భారీ అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో వైశ్య నాయకులు కాళ్లకూరి నాగబాబు, గ్రంధి నమఃశివాయ, చెన్నా రాంబాబు, వీరపండు, మన్యం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. మండపేట కలవపువ్వు సెంటరులోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు.

**ఆత్రేయపురం:** కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి తొలి ఏకాదశి సందర్భంగా బుధవారం భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు క్యూ లైన్లలో బారులుతీరి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ పరిసరాలు గోవింద నామస్మరణతో మార్మోగాయి. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తనయులు సందీప్, సంజీవ్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలుచేశారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.6,72,589 లభించినట్టు ఉపకమిషనరు, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు.

**యానాం:** యానాంలో శ్రీభూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో తొలి ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. అర్చకులు పెద్దింటి రఘురామ వినోదాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం నుంచి ఆలయంలో పంచామృతాభిషేకం, పుష్పార్చన తదితర పూజలు నిర్వహించారు. ఉదయం 6నుంచి సాయంత్రం 6గంటల వరకు లలిత మహిళా మండలి సభ్యులు విష్ణుసహస్రనామ పారాయణం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

**మలికిపురం:** బుధవారం వేకువజాము నుంచే మండలంలోని ఆలయాలకు భక్తులు పోటెత్తారు. వైష్ణవాలయాల్లో ఉదయం నుంచే ప్రత్యేక పూజలు జరిపారు. పలు ఆలయాల్లో భజనా కార్యక్రమాలు నిర్వహించారు.

**అంతర్వేది:** అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి బుధవారం భక్తులు పోటెత్తారు. తొలుత నదీ సముద్ర పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు ఆంజనేయస్వామి, క్షేత్ర పాలకుడు నీలకంఠేశ్వరస్వామి, లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం క్షేత్ర ఆలయాలను సందర్శించి స్వామివారి నిత్యాన్నదానంలో ప్రసాదం స్వీకరించారు. స్వామివారి నిత్య అభిషేకం, సుదర్శనహోమం, ప్రత్యేక దర్శనాల ద్వారా 8వేల మంది భక్తులు స్వామిని దర్శించుకున్నట్టు ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం కొత్తాట గ్రామానికి చెందిన భక్తులు పాదయాత్రగా విచ్చేసి స్వామిని దర్శించుకున్నారు.

**రాజోలు:** మండలంలోని ఆయా గ్రామాల్లో వైష్ణవాలయాలు, దేవాలయాలు భక్తులతో కిక్కిరిశాయి. రాజోలు, పొన్నమండ, శివకోటి శివాలయాలు, కడలి కపోతేశ్వరస్వామి, సోంపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాలు ఉదయం నుంచి భక్తులతో కిటకిటలాడాయి. అధికసంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. ఆలయాలను పుష్పాలు, విద్యుద్దీపాలతో అలంకరించారు. అధికారులు, ఆలయ కమిటీలు ఏర్పాట్లు చేశారు. పలుఆలయాల్లో భజనా కార్యక్రమాలు జరిగాయి.

**అంబాజీపేట:** మండలంలోని పలు ఆలయాల్లో బుధవారం తొలిఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచే ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని పలు ఆలయాల్లో అభిషేకాలు, అమ్మవార్కి కుంకుమపూజలు నిర్వహించారు. అంబాజీపేట కొర్లపాటివారిపాలెం శ్రీభూసమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం, పెద్దవీధిలోని కోదండరామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**అల్లవరం:** బెండమూర్లంకలోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి, లక్ష్మణేశ్వరం, గుండెపూడి ఆలయాల్లో తొలి ఏకాదశి పర్వదిన పూజలు ఘనంగా జరిగాయి. మహిళలు ఇళ్ల వద్ద భక్తి ప్రపత్తులతో ఏకాదశి పూజలు చేశారు.

**అమలాపురం రూరల్:** నల్లమిల్లి గ్రామదేవత శ్రీసత్తెమ్మతల్లిని గ్రామంలోని ఆడపడుచులు, భక్తులు గాజులతో విశేష అలంకారం చేశారు. ఆషాఢ మాసం తొలి ఏకాదశిని పురస్కరించుకుని ఆడపడుచులు ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకుని చలిమిడి, పానకం చెల్లించారు. గాజుల అలంకారంలో అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని, విశేష పూజలు చేశారు. ఆషాఢ మాసం తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీకామాక్షీ పీఠంలో పీఠాధిపతి కామేశ మహర్షి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణ, పరిసర ప్రాంతాలకు చెందిన వందలాది మంది మహిళలు శ్రీకామాక్షీ దేవికి ఆషాఢం సారెను ఊరేగింపుగా తీసుకువచ్చారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలతో కోలాట బృందాలు వెంట రాగా అమ్మవారికి సారె సమర్పించారు. పూజల అనంతరం ప్రసాద వితరణ చేశారు.

**కపిలేశ్వరపురం:** మండలంలోని గ్రామాల్లో ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. భక్తులు స్వామివారిని, అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. అంగర, కపిలేశ్వరపురం, కోరుమిల్లి, కాలేరు, వెదురుమూడి, వల్లూరు గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

## విజయసాయిరెడ్డి వ్యాఖ్యలకు నిరసనగా.. నల్ల బ్యాడ్జీలతో ర్యాలీ


అమలాపురంలో గాంధీ విగ్రహానికి వినతి అందజేసి నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

అమలాపురం టౌన్, జూలై 17: మీడియాపై ఎంపీ విజయసాయిరెడ్డి అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ జర్నలిస్టులు నల్లబ్యాడ్జీలు ధరించి బుధవారం అమలాపురం గడియారస్తంభం సెంటర్లో నిరసన తెలిపారు. విజయసాయిరెడ్డి జర్నలిస్టులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండు చేశారు. నోరు అదుపులో పెట్టుకోవాలని, లేని పక్షంలో సహించేది లేదని హెచ్చరించారు. గడియార స్తంభం సెంటరు నుంచి ర్యాలీ నిర్వహించారు. మహాత్మాగాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అక్కడి నుంచి ర్యాలీగా జిల్లా పోలీసు కార్యాలయానికి చేరుకున్నారు. ఒక వ్యక్తి చేసిన ఆరోపణలను మీడియా ప్రసారం చేయడం నేరమా అని పలువురు జర్నలిస్టులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్పీ బొడ్డేపల్లి కృష్ణారావుకు వినతిపత్రం అందజేసి విజయసాయిరెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. బీజేపీ కిసాన్‌మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లా పవన్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు వంటెద్దు బాబీ, కుడుపూడి శ్రీనివాస్‌తో పాటు జర్నలిస్టు సంఘాల సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

**కొత్తపేట:** విలేకర్లపై అనుచిత వ్యాఖ్యలుచేసిన విజయసాయిరెడ్డిపై చర్యలు తీసుకోవాలని నియోజక వర్గ జర్నలిస్టులు ఎస్ఐ అశోక్‌కు ఫిర్యాదుచేశారు. పంచాయతీ కార్యాలయం నుంచి సర్పంచ్, జర్నలిస్టులు ర్యాలీగా వచ్చారు.జర్నలిస్టులు బొరుసు జానకిరామయ్య, నామాడి రాజేంద్రప్రసాద్, సలాది గణేష్, టి.అర్జున్, గొల్లపల్లి సూరిబాబు, అరుణ్‌కుమార్, సర్పంచ్ బూసి జయలక్ష్మి, ముత్యాల బాబ్జీ, రెడ్డి తాతాజీ, బీర ఇసాక్, కాశీ ధనరాజు, బూసి విష్ణుమూర్తి, నెల్లి నాని పాల్గొన్నారు.

**పి.గన్నవరం:** జర్నలిస్టులను రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి అసభ్యపదజాలంతో దూషించడం తగదని కూటమి నాయకులు మండిపడ్డారు. పి.గన్నవరం త్రిరోడ్ సెంటర్ నుంచి స్థానిక పోలీస్‌స్టేషన్ వరకు జర్నలిస్టులు నిర్వహించిన నిరసన ర్యాలీలో వారు పాల్గొని మాట్లాడారు. అనంతరం విజయసాయిరెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఎస్ఐ బి.శివకృష్ణకు వినతిపత్రం అందించారు. కూటమి నాయకులు సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, యర్రంశెట్టి సాయిబాబు, శేరు శ్రీనుబాబు, తాటికాయల శ్రీనివాసరావు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

**మండపేట:** వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి జర్నలిస్టులపై చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ ఆయనపై బుధవారం మండపేట ఏపీడబ్ల్యూజే సంఘ సభ్యులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సాయిరెడ్డి వ్యాఖ్యలను సంఘ నాయకులు ఖండించారు. సంఘ నాయకులు టి.రామకృష్ణ, యార్లగడ్డ ప్రసాద్, సతీష్, అప్పారావు, వినోద్, సత్య రాజు పాల్గొన్నారు.

## ఫిట్‌నెస్ సెంటర్ ప్రారంభం

మండపేట, జూలై 17: మండపేటలో నూతనంగా ఏర్పాటు చేసిన మేక్స్‌పవర్ ఫిట్‌నెస్ సెంటర్ (జిమ్)ను ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావున బుధవారం ప్రారంభించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవర ప్రకాష్, వల్లూరి సాయికుమార్, బొడ్డు రామకృష్ణ, పాల్గొన్నారు.

## శ్వేతపత్రాలతో వైసీపీ అరాచకాలు వెలుగులోకి

మామిడికుదురు, జూలై 17: వైసీపీ ప్రభుత్వ అరాచకాలను శ్వేతపత్రం ద్వారా కూటమి ప్రభుత్వం బయట పెడుతుందని జడ్పీ మాజీ ఛైర్మన్, పి.గన్నవరం టీడీపీ సమన్వయకర్త నామన రాంబాబు అన్నారు. మగటపల్లిలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో జరిగిన అక్రమాలు, దోపిడీలపై ప్రజలు వాస్తవాలు తెలుసుకునేందుకు కూటమి ప్రభుత్వం శ్వేతపత్రాలను విడుదల చేస్తుందన్నారు. ఐదేళ్ల పాలనలో రూ.35,576కోట్లు విలువైన 1.75లక్షల ఎకరాల భూఆక్రమణలు జరిగాయన్నారు. ఇళ్ల పట్టాల పేరుతో పది వేల ఎకరాలు, ఇసుక దందాతో రూ.9,750 కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. ఇళ్ల పట్టాల్లో వైసీపీ నేతలు దోచుకున్న ప్రజాధనాన్ని వసూలుచేసి ప్రజా ఖజానాకు కూటమి ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు మొల్లేటి శ్రీనివాస్, ప్రధాని కార్యదర్శి వర్ధినేని బాబ్జి, నాయకులు బోనం బాబు, మద్దాల కృష్ణమూర్తి, మోత వెంకటేశ్వరరావు, పడమట సత్యనారాయణ, గోకవరపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

## అర్హులందరికీ పరిహారం ఇవ్వాలి

యానాం, జూలై 17: యానాం నియోజవర్గంలో మహిళలకు సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఇచ్చే రూ.వెయ్యి సహాయాన్ని అర్హులందరికీ అందజేయాలని ఎన్ఆర్ కాంగ్రెస్ యానాం అధ్యక్షుడు మల్లాడి శామ్యూల్ కోరారు. పుదుచ్చేరి వెళ్లిన ఆయన సీఎం ఎన్.రంగసామిని కలిసి వినతిపత్రం అందజేశారు. తొలుత సీఎంను శాలువతో సత్కరించారు. ఇంటి పెద్దగా ఉన్న మహిళకు నెలకు రూ.వెయ్యి నగదు అందజేసే పథకం పొందడానికి దరఖాస్తులో స్థానిక ప్రజాప్రతినిధి సంతకం ఉండాలని అధికారులు సూచిస్తున్నారని, దీంతో వెయ్యికి పైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. ఇలాంటి దరఖాస్తుల విషయంతో అధికారులే అనుమతించేలా ఉత్తర్వులు జారీ చేయాలని లేదా ప్రత్యామ్నాయ మార్గం చూపాలని శామ్యూల్ కోరారు.

## కాలి నడకన బాలబాలాజీ స్వామి సన్నిధికి

మామిడికుదురు, జూలై 17: అప్పనపల్లి బాలబాలాజీస్వామి దర్శనం కోసం బుధవారం మామిడికుదురు అభయాంజనేయస్వామి ఆలయం వద్ద నుంచి వంద మంది భక్తుల బృందం కాలినడకన అప్పన పల్లి వచ్చింది. స్వామివార్ని దర్శించుకుని స్వామికి వివిధ రకాల పండ్ల రసాలతో అభిషేకం జరిపించారు.

## లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

అమలాపురంటౌన్,జూలై17: లయన్స్ క్లబ్ నూతనకార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం స్థానిక సరోసీవీ రామన్ పాఠశాల ప్రాంగణంలో బుధవారం జరిగింది. జిల్లా రవాణా అధికారి అశోక్‌ప్రతాప్‌రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అధ్యక్షుడిగా రవణం వేణుగోపాలరావు, కార్యదర్శిగా మద్దెల వెంకటేశ్వరరావు, కోశాధికారిగా పొత్తూరి వెంకటపతిరాజు, కార్యవర్గ సభ్యులతో డీవీఎస్ రాజు ప్రమాణం చేయించారు. లయన్స్ క్లబ్ సీనియర్ ప్రతినిధులు వేలూరి సూర్యనారాయణపాల్గొన్నారు.

## ఓర్వలేకే వైసీపీ నేతలు తప్పుడు ఆరోపణలు

రావులపాలెం, జూలై17: కూటమి ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధికి విశేష కృషి చేస్తుంటే ఓర్వలేక వైసీపీ నాయకులు అసత్య ఆరోపణలు చేస్తున్నారని టీడీపీ మండల అధ్యక్షుడు గుత్తుల పట్టాభి రామారావు, టీడీపీ నాయకులు ఆరోపించారు. స్థానిక టీడీపీ క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర రాజధానికి ఏర్పాట్లు, పోలవరం అభివృద్ధి, మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా పింఛన్ల అందజేత తదితర అభివృద్ధి పనులు సీఎం చంద్రబాబు చేస్తుంటే వైసీపీ నాయకులు తప్పుడు ఆరోపణలు చేయడం దారుణమన్నారు. మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అసత్య ఆరోపణలు చేయడం తగదన్నారు. వైసీపీ నాయకులకు దోచుకోవడం అలవాటై ఉచితంగా ఇసుక ప్రజలకు చేరుతుంటే చూసి ఓర్వలేక పోతున్నారన్నారు. సూపర్‌సిక్స్ పథకాలను అర్హులందరికీ అందిస్తామన్నారు. సమావేశంలో తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు చిలువూరి సతీష్‌రాజు, సిద్ధిరెడ్డి శ్రీను, కాసా విజయసాగర్, జక్కంపూడి వెంకటస్వామి, కోనాల అంబేడ్కర్, కాసురెడ్డి, మాసాబత్తుల ఆనందరావు, వెలగల శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

## విద్యా శాఖ కమిషనర్ పూజలు

ఆత్రేయపురం, జూలై 17: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామిని సమగ్ర శిక్షా పథక రాష్ట్ర సంచాలకుడు బి.శ్రీనివాసరావు దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వారికి వేదపండితులు ఆశీర్వచనం అందజేశారు. ఆయన వెంట ఎంఈవో పి.వరప్రసాదరావు, యూటీఎఫ్ నాయకుడు ప్రసాద్ ఉన్నారు. దేవదాయ శాఖ ప్రాంతీయ కమిషనరు రత్నరాజు కుటుంబ సభ్యులతో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఆయనకు ఉప కమిషనరు భూపతిరాజు కిషోర్ కుమార్ స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆత్రేయపురం, జూలై17: ఆత్రేయపురం, అంకంపాలెం సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ రవికుమార్ తెలిపారు. 33కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా ఉదయం 8నుంచి 2గంటలవరకు సరఫరా ఉండదన్నారు.

## గోశాలకు 250కిలోల దాణా వితరణ

అంతర్వేది, జూలై 17: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం గోశాలకు కేశవదాసుపాలేనికి చెందిన బెల్లంకొండ వెంకటేశ్వరరావు (ఏడుకొండలు)-సత్యవతి దంపతులు రూ.6వేలు విలువైన 250కిలోల దాణాను ఆలయ సూపరింటెండెంట్ పి.విజయసారధికి అందించారు.

## సినిమా గైడ్

### అమలాపురం

| | |
|---|---|
| వెంకటరమణ | : ఓంజీ |
| శ్రీలలిత | : సారంగ దరియా |
| శేఖర్ స్క్రీన్-1 | : కల్కి |
| శేఖర్ స్క్రీన్-2 | : --- |
| రమా | : భారతీయుడు 2 |
| గణపతి | : రౌడీ గ్యాంగ్ |
| వెంకటపద్మావతిస్క్రీన్-1 | : కల్కి |
| వెంకటపద్మావతి స్క్రీన్-2 | : --- |

## నియోజకవర్గం మొదటి స్థానంలో నిలవాలి

పి.గన్నవరం, జూలై17: జనసేన పార్టీ క్రియశీలక సభ్యత్వ నమోదులో రాష్ట్రంలో గన్నవరం నియోజకవర్గం మొదటిస్థానంలో నిలిపే దిశగా ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఐటీవింగ్ నియోజవర్గ అధ్యక్షుడు మేడిద శివకుమార్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించిమాట్లాడారు. పార్టీ మండల అధ్యక్షుడు సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, దొమ్మేటి సాయికృష్ణ, జాలెం శ్రీనివాస రాజా, జిల్లా కార్యదర్శి మద్దా చంటిబాబు, సర్పంచ్ అడబాల తాతకాపు, ఎంపీటీసీ పల్లి మోషే, తాటికాయల శ్రీనివాసరావు, తాటికాయల వెంకటేష్ పాల్గొన్నారు.

## తక్కువ ధరలకు నాణ్యమైన సరుకులు

పి.గన్నవరం, జూలై 17: సరసమైన ధరలకు నాణ్యమైన సరుకులను అందించాలని తహశీల్దార్ ఎస్‌కే హుస్సేన్ కోరారు. పి.గన్నవరం ప్రధాన రహదారి చెంతనే ఉన్న టీఎస్ఆర్ ట్రేడర్స్ వద్ద ధరల నియంత్రణ పట్టికను ఏర్పాటుచేసి అనంతరం మాట్లాడారు. హోల్‌సేల్ షాపులు నుంచి కందిపప్పు, బియ్యం స్థానిక రిటైల్ దుకాణాలకు అందించి మార్కెట్ ధర కంటే తగ్గించి సరుకులు అందించడానికి చర్యలు చేపట్టామన్నారు. కందిపప్పు (దేశవాళి) ప్రస్తుత ధర రూ.181ఉంటే ప్రభుత్వంసూచనతో రూ.160కే విక్రయిస్తార న్నారు. బియ్యం (స్టీమ్డ్-బీపీటీ-సోన మసూరి) ధర రూ.55.85ఉంటే రూ.49కే అందించాలన్నారు. బియ్యం (పచ్చి-బీపీటీ-సోన మసూరి) ధర రూ.52.40 ఉంటే రూ.48కే అందించాలన్నారు. ప్రతికిరాణా షాపులో ఈరకమైన సరుకులు అందుబాటులో ఉంటాయన్నారు. సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహశీల్దార్ డి.శ్రీనివాస్, ఇన్‌చార్జ్ ఆర్ఐ పి.నరసింహరావు, వీఆర్వో శివరామకృష్ణ తదితరులు ఉన్నారు.

## శివలలో టీడీపీ నాయకుల శ్రమదానం



కె.గంగవరం, జూలై 17: శివల గ్రామంలో టీడీపీ నాయకులు శ్రమదానం చేశారు. యర్రపోతవరం - శివల ప్రధాన రహదారి పెద్దపెద్ద గుంతలతో అధ్వానంగాఉంది. వర్షాకాలం కావడంతో గుంతల్లో నీరు నిలిచిపోయి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు నిడదవోలు సుబ్రహ్మణ్యం ప్రోత్సాహంతో యువకులు మెటల్‌తో గుంతలు పూడ్చారు. కార్యక్రమంలో నిడదవోలు రవి, వాసంశెట్టి నాగు, నిడదవోలు రవి, రామారావు, వాసంశెట్టి తరుణ్, సంతోష్, యాదల వీరేంద్ర, నాగరాజు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారంపై దృష్టి

కొత్తపేట, జూలై 17: కొత్తపేట మేజర్ పంచాయతీ పరిధిలో సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్టు సర్పంచ్ బూసి జయలక్ష్మీభాస్కరరావు తెలిపారు. కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రి రోడ్డులో రూ.5లక్షలతో డ్రైనేజీ నిర్మాణానికి బుధవారం ఆమె భూమి పూజ చేశారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో సర్పంచ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సహకారంతో మేజర్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కంఠంశెట్టి శ్రీనివాసరావు, విళ్ల వీరమారుతిప్రసాద్, వాసంశెట్టి సత్యనారాయణ, ముత్యాల బాబ్జీ, బీర ఇసాక్, కముజు వెంకటేశ్వరరావు, దేవపాటి వెంకటేశ్వరరావు, మిద్దే ఆదినారాయణ, తమ్మన సాయిప్రసాద్ పాల్గొన్నారు.

## కంకిపాటి సోదరులకు ప్రముఖుల పరామర్శ


నారాయణమ్మ

అల్లవరం, జూలై 17: మాతృ వియోగంతో బాధపడుతున్న జనసేన నాయకుడు కంకిపాటి పెదబుజ్జి, కంకిపాటి వీరబాబులను పలువురు పరామర్శించారు. వారితల్లి నారాయణమ్మ(67) బుధవారం మృతిచెందారు. బుజ్జి, వీరబాబులను ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, ఎంపీడీవో కృష్ణమోహన్, టీడీపీ, బీజేపీ మండల అధ్యక్షులు దెందుకూరి సత్తిబాబు రాజు, సుంకర సాయిబాబా, నాయకులు తోలేటి దొరయ్యనాయుడు, బండిగుప్తాపు సత్తిబాబు, పాండురంగా, మెరికల శ్రీను, బండిగుప్తాపు సూర్యబాల, దాసం రాంబాబు, చిట్టినీడి శ్రీనివాస్ పరామర్శించారు.

## శోకతప్త హృదయాలతో మొహర్రం

ముమ్మిడివరం, జూలై 17: ముమ్మిడివరంలో మహ్మద్‌ప్రవక్త మనుమడు హజరత్ ఇమామ్‌హుస్సేన్, అతని 72మంది పరివారం కర్బలా మైదానంలో అశువులు బాసిన సంఘటనకు ముస్లింలు బాధాతప్త హృదయాలతో మాతం నిర్వహించారు. ముమ్మిడివరంలోని ముస్లింవీధిలో ఉన్న బీబీజైనాబ్‌పీర్ల పంజా, హజ్రద్ అబ్బాస్, షహదో షోహదా అలీ అసగర్, బైతుల్‌ఖాయం, సజ్జాదియా పీర్ల పంజాల్లో పది రోజుల నుంచి మజ్లిస్‌లు నిర్వహించి మాతం చేస్తూ రోదిస్తూ ఇమ్మాహుస్సేన్, అతని పరివారానికి శ్రద్ధాంజలి ఘటించారు. ఉత్తరప్రదేశ్ నుంచి విచ్చేసిన మౌలానా మొహమ్మద్ షంషీ కర్బలా మైదానంలో జరిగిన యదార్థ సంఘటనలు వివరించారు. ముమ్మిడివరంలో అసురానాను పురస్కరించుకుని రక్తాన్నిచిందిస్తూ హుస్సేన్ హుస్సేన్ అంటూ గుండెలు బాదుకుంటూ మాతం చేస్తూ పురవీధుల్లో పీర్లను ఊరేగించారు. ముస్లింలు హజరత్ ఇమామ్‌హుస్సేన్ పరివారానికి సంతాపం తెలిపారు.

**అంబాజీపేట:** త్యాగానికి ప్రతీక మొహర్రాన్ని ముస్లింలు బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం దివంగతులైన వారికి ఆత్మకు శాంతి చేకూరాలని దువ్వా చేశారు. కార్యక్రమంలో మహ్మద్ రఫీ, సురాజ్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

**కపిలేశ్వరపురం:** పలు గ్రామాల్లో మొహర్రం పండుగను ముస్లింలు బుధవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. అంగర మస్జిద్ - ఎ - ఇబ్రహీమ మసీదులో నిర్వహించిన కార్యక్రమంలో మస్జిద్-ఎ-ఇబ్రహీమ ముతవల్లీ మహ్మద్ అబ్బాస్ హుస్సేన్ ఆధ్వర్యంలో మసీద్ ఇమామ్ మహ్మద్ నాజీం అక్తర్ మొహర్రం ప్రాముఖ్యతను వివరించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కపిలేశ్వరపురం గ్రామపురవీధుల్లో పీర్లను, గుమ్మటాన్ని ఊరేగించారు.

**అల్లవరం:** అల్లవరం పీర్ల పంజా వద్ద ముస్లింలు సంతాప దినం పాటించారు. ముజావర్ జానీ, ముజావర్లి షేక్ గౌషియా, షేక్ రెహ్మాన్, మస్తాను, ఖాజా, ఇర్ఫాన్, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

## డ్రైవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శివప్రసాద్



యానాం, జూలై 17: యానాం ప్రభుత్వ డ్రైవర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా యానాం డిప్యూటీ కలెక్టర్, పరిపాలనాధికారి కార్యాలయ డ్రైవర్ ఏలూరి శివప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.అసోసియేషన్ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌవర అధ్యక్షుడిగా పెనుపోతు భైరవస్వామి, అధ్యక్షుడిగా ఏలూరి శివప్రసాద్, ఉపాధ్యక్షుడిగా శేరు కమల శ్రీనివాసరావు, కార్యదర్శిగా కట్టా ఆనంద్, కోశాధికారిగా అత్తిలి గోవిందరాజు, సంయుక్త కార్యదర్శిగా బల్లిపాటి ముసలయ్య, అడ్వయిజర్‌గా బొడ్డు నాగసూర్యప్రసాద్, కార్యవర్గ సభ్యులుగా శేరు వెంకటేశ్వరరావు, యనమదల రాంబాబు, సెమ్మె వీరవెంకట సత్యనారాయణ, చేటకాల సుబ్బారావు, బేతాశం సత్యనారాయణ, మట్టపర్తి దుర్గాప్రసాద్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులు ఆర్ఏ మునిస్వామిని కలిసి శాలువాతో సత్కరించారు.

## కాల్వను బాగు చేయించుకున్న రైతులు

ఆలమూరు, జూలై17: ఒకపక్కవర్షాలకు పొలాలు ముంపునకు గురవుతున్నాయి... మరోపక్క సాగునీరు అందట్లేదు. గుమ్మిలేరులో పంట కాల్వకు ఐదేళ్లుగా తవ్వకాలు లేక మెరకతో సాగునీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని జైనదేవాలయం వద్ద ఉన్న చొప్పెల్ల-వల్లూరు కాల్వ ద్వారా వేలాది ఎకరాలకు సాగునీరందాల్సి ఉంది. పలు ప్రాంతాల్లో కాల్వ మెరకకావడంతో పలు భూములు అధికవర్షాలకు ముంపుబారిన పడ్డాయి. కొన్నిభూములకు సాగునీరు చేరట్లేదు. తెలుగు రైతు మండల అధ్యక్షుడు ఈదల వీర్రాజుచౌదరి ఆధ్వర్యంలో ఎక్స్‌కవేటరుతో కాల్వలోని మెరక, గుర్రపుడెక్క తొలగించే పనికి బుధవారం శ్రీకారం చుట్టారు. వచ్చే సీజను నాటికి పూర్తిస్థాయిలో నిధులు కేటాయించి కాల్వ తవ్వకాలు చేపట్టాలని కోరారు.

## బీవీ రమణయ్య జయంతి వేడుకలు

ముమ్మిడివరం, జూలై 17: రిపబ్లికన్ పార్టీ మాజీ ఎమ్మెల్యే, రిపబ్లికన్ స్టూడెంట్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బీవీ రమణయ్య 89వ జయంతిని రిపబ్లికన్ పార్టీ ఆధ్వర్యంలో ముమ్మిడివరంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం ముమ్మిడివరంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కన్వెన్షన్ హాలులో ఆర్పీఐ జిల్లా అధ్యక్షుడు గిడ్డి జ్ఞానప్రకాష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆర్పీఐ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ఎం రుషి మాట్లాడారు. రమణయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో బళ్ల సత్యనారాయణ, దడాల రామకృష్ణ, చీకురుమెల్లి చిరంజీవి, నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, మోకా బాలయోగి, మట్టా వెంకట్రావు, టి.వెంకటేశ్వరరావు, కె.వెంకటరమణ, జనిపల్లిసత్యనారాయణ, కాశి మురళీ, కాశి నానాజీ, దోనిపాటి అంజనేయులు, చీకురుమెల్లి కృష్ణమూర్తి, బడుగు సత్యనారాయణ, మోకా కృష్ణమూర్తి, దేవరపల్లి ఏడుకొండలు, మోర్త ధనకాసులు, జి.శ్రీనివాస్, గల్లా రాజజేంద్ర పాల్గొన్నారు.

**ఉప్పలగుప్తం:** అల్లవరం మాజీ ఎమ్మెల్యే, రిపబ్లికన్ నాయకుడు బీవీ రమణయ్య 90వ జయంతిని చల్లపల్లిలో దళిత ఐక్య వేదిక జిల్లా కార్యదర్శి ఇసుకపట్ల రఘుబాబు ఆధ్వర్యంలో బుధవారం జరుపుకున్నారు. రమణయ్య విగ్రహానికి నివాళులర్పించారు. భీమనపల్లి బాలుర హాస్టల్లో మాలమహానాడు ఆధ్వర్యంలో జయంతి జరిగింది. ఆయా కార్యక్రమాల్లో నిమ్మకాయల చెల్లయ్యానాయుడు, గొలకోటి చిన్నా, పరమట వెంకటేశ్వరరావు, కొల్లు ప్రసాదరావు, కాట్రు ఆనందరావు, సర్పంచ్ పెయ్యల రాజ్‌కుమార్, కొంకి వెంకటబాబ్జీ పాల్గొన్నారు.

## అంబానీ దంపతులకు కోనసీమ ఘనాపాఠీల ఆశీర్వచనం



అమలాపురం రూరల్, జూలై 17: ముఖేష్ అంబానీ ఇంట అంగరంగ వైభవంగా జరిగిన పెళ్లి వేడుకల్లో కోనసీమ వేద పండితులు పాలుపంచుకున్నారు. అనంత్ అంబానీ-రాధిక మర్చంట్ దంపతులకు కోనసీమలోని నందంపూడికి చెందిన కర్రా విశ్వనాథ ఘనాపాఠీ, పాశర్లపూడిలంకకు చెందిన గంటి భార్గవ ఘనాపాఠీ, ఇందుపల్లికి చెందిన గొర్తి సాంబశివ ఘనాపాఠీ, కమలేష్ ఘనాపాఠీ వేదాశీర్వచనం అందించారు.

## జనసేన సభ్యత్వాలు వేగంగా పూర్తిచేయాలి

అంబాజీపేట,జూలై17: జనసేనపార్టీ సభ్యత్వాలు వేగంగా పూర్తిచేయడానికి జనసైనికులు కృషిచేయాలని జనసేన మండల అధ్యక్షుడు దొమ్మేటి సాయికృష్ణ అన్నారు. స్థానిక కొర్లపాటివారిపాలెం సామాజిక భవనంలో జనసైనికుల సమావేశం బుధవారం జరిగింది. ఈనెల28వరకు పార్టీ సభ్యత్వాలు, రెన్యూవల్స్ చేయాలన్నారు. సభ్యత్వంగలవ్యక్తి మరణిస్తే రూ.5లక్షలు బీమా వస్తుందన్నారు. కొర్లపాటి గోపి, అరిగెల సూరిబాబు, సుంకర బాలాజీ, కొర్లపాటి డీల్లి, దిగుమర్తి చిట్టిబాబు, మట్టపర్తి రమేష్, అడపా బాబ్జి, అక్కిశెట్టి ప్రసాద్ పాల్గొన్నారు.

## సివిల్ సప్లయిస్ సభ్యుడిగా పుట్టపూడి

కపిలేశ్వరపురం, జూలై 17: నిడసనమెట్ట గ్రామానికి చెందిన జడ్పీటీసీ పుట్టపూడి వీరవెంకట సూర్యనారాయణ(అబ్బు) సివిల్ సప్లయిస్ సభ్యుడిగా నియమితులయ్యారు. అంకిత భావంతో పనిచేస్తానని తెలిపారు.

## ట్రాఫిక్ సమస్యపై వినతి

అమలాపురంటౌన్, జూలై17: పట్టణంలో ట్రాఫిక్ సమస్య పెరిగిపోయిందని, వాహనచోదకులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో బుధవారం పట్టణ సీఐ కె.క్రిస్టఫర్‌కు వినతిపత్రం అందజేశారు. పశువులను యజమానులు రోడ్లపై విచ్చలవిడిగా వదిలేస్తున్నారని, దీంతో ప్రమాదాలు జరిగాయని వివరించారు. ముస్కూరి ఏసుబాబు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.